## మహనీయుల జీవిత చరిత్ర చదివితే గొప్ప మార్పు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పావని వినయ్‌కుమార్, కళా జనార్ధనమూర్తి తదితరులు.

హైదరాబాద్, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి):మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలు చదివితే గొప్ప మార్పు సాధ్యమని రాజ్యసభ సభ్యుడు, భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా॥ కె. లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు.రచయిత రాగం రచించిన **'సిద్దేశ్వర స్వామీజీ జీవిత చరిత్ర యోగస్థ'** తెలుగు అనువాద పుస్తకావిష్కరణ ఆదివారం తాయగరాయ గానసభలో జరిగింది. కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్, వసుంధర బిల్డర్ వ్యవస్థాపక డైరెక్టర్లు రాగం పోతిరెడ్డి రమేశ్‌బాబు, వరుణ్ అగర్వాల్, డైరెక్టర్ పోలీస్‌పటేల్ శ్రీనివాస్‌రెడ్డి, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి పాల్గొన్నారు.

# సాహితీ సంద్రంలో ఉద్యమ కెరటం శేషేంద్ర

కవి, సాహిత్య విమర్శకుడు, అలంకార శాస్త్రాలను ఔపోసన పట్టిన వాడు, సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషల్లో పండితుడు , దేశ విదేశాల్లో తెలుగు సాహిత్య పతాకం ఎగురవేసిన ఏకైక తెలుగు కవి శేషేంద్ర.

శేషేంద్ర తన 20వ యేటనే తొలిసారిగా "సోరాబు"అనే ఒక స్వతంత్ర పద్య కావ్యం రచించారు. ముద్రితమైన మొదటి రచన"ఒక పాట". ఆయన కవిత్వం భావ అభ్యుదయ కవిత్వాల అపూర్వ సమ్మేళనంగా కనిపిస్తుంది. ఆయన రచనలు సాంప్రదాయ ఆధునిక తత్వాల మేళవింపు. వచన కవిత్వం, పద్య రచన రెండింటిలోనూ సమాన ప్రతిభావంతులు. సృజన, విమర్శన, పరిశోధన శక్తులు ఒకే వ్యక్తిలో ఉండటం అరుదైన అద్భుతం.

కవికి,విమర్శకునికి ఉండవలసిన ప్రధాన చైతన్యం అనుభూతికి లోను కావడమేనని చాటిన వారు శేషేంద్ర. సాహిత్యాన్ని ఆత్మకళగా భావించారు. సాహిత్య స్పృహలు, సత్య ధర్మాల తాత్పర్యం మీదనే శేషేంద్ర గారి సాహితీ వ్యాసంగం కొనసాగింది. తొలినాళ్లలో ఆయన రచనలు పద్య రూపంలో సాగినా, తరువాత కాలంలో గేయం, వచన, దీర్ఘ వచన కవితా రూపాలలో ప్రయాణించారు., ప్రగతిశీల దృష్టితో కవితా రచన చేశారు. ఆధునిక కావ్య భాషను సృష్టించి,పాశ్చాత్య ఇతిహాస ప్రక్రియలను అధ్యయనం చేసి, వాటిని ఆధునిక ప్రక్రియలుగా మార్చి, కొత్త భావాలు, ప్రతీకలను ఆధునిక వచన కవిత్వానికి అందించిన వారు శేషేంద్ర.

.ఋతుఘోష (1963) శేషేంద్ర పద్య విద్యలో విశిష్టమైన రచన. శేష జ్యోత్స్న (1972) వచన కవితా ప్రస్థానానికి నాంది. మండే సూర్యుడు, నా దేశం నా ప్రజలు, గొరిల్లా విప్లవ కవితా బాటలో రాసినవి. నా దేశం నా ప్రజలు (1975) ఒక ఆధునిక ఇతిహాసం. వ్యక్తీకరణ, కవితా వస్తు విన్యాసంలో ఈయన తనదైన వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు. తొలి ముద్రణకు శేషేంద్ర గారి ఉపోద్ఘాతంలో "ఇతిహాస నిర్మాణానికి బాధానుభూతి పూర్వక బలి కావాలి, నేనే ఆ బలి, నా వయస్సు, నా పాండిత్యం, నా ప్రతిభ, నా అనుభవం సర్వం పిండి మాటల గొంతులో పోసిన నా రక్తం ఈ ఇతిహాసం. ప్రపంచ మానవుల్ని, వాళ్ల చరిత్రల్ని, వాళ్ళ జయాపజయాల్ని, వాళ్ల భూత భవిష్యద్వర్తమానాలని అనుభవ జ్ఞాన నేత్రద్వంద్వంతో అవలోకన చేసి ఆ విశ్వదృశ్యం నుంచి ఈ తాత్పర్యం పిండాను, మే నెలలో నీలగిరి కొండల్లో కూర్చుని" అని ఆయన రాసుకున్నారు. వర్తమాన ఆంధ్ర కవిత్వంలో ఇతిహాసం ఒక అచుంబితమైన ప్రక్రియ. సామాన్య కర్షకుని జీవిత గాధే నాదేశం నా ప్రజలు ఇతివృత్తం.ఇంగ్లీషును మన దేశానికి ఆధునిక సంస్కృతంగా అభివర్ణించిన శేషేంద్ర ఈ కావ్యాన్ని ఆ భాషలోకి( మై కంట్రీ మై పీపుల్) కూడా తానే అనువదించడం ఆయన పాశ్చాత్య పాండిత్యానికి నిదర్శనం. విడివిడిగా కావ్య రూపంలో ఉన్న ఈ రచనలన్నీ పర్వాలుగా విభజించి ఆధునిక మహాభారతంగా మలిచారు. అరుస్తున్న ఆధ్మీ అనే చిన్న కవితలు ఆధ్మీ పర్వంగా మారితే, శేష జ్యోత్స్న జ్యోత్స్న పర్వంగా, నా దేశం నా



ప్రజలు ప్రజాపర్వంగా, సముద్రం నా పేరు సముద్ర పర్వంగా రూపొందాయి.

1977 లో వచ్చిన కవిసేన మేనిఫెస్టో, అసలు కవిత్వం అంటే ఏమిటి? ఎలా రాయాలి? ఎందుకు రాయాలి? ఎవరికోసం రాయాలి? ఇటువంటి తాత్విక అంశాలపై ఆధునిక సాహిత్యనీలో తెలుగులో వెలువడిన ప్రామాణిక గ్రంథం. అప్పట్లో సాహిత్యంలో అన్ని వర్గాలను, అన్ని సంఘాలను తీవ్రమైన ఆందోళనకు మనస్తాపానికి గురిచేసింది. దేశానికి నాయకత్వం వహించాల్సిన కవి, రాజకీయ భవనాల్లో పెంపుడు కుక్కగా బ్రతకడాన్ని నిరసిస్తూ తనకున్న ఆయుధాలను గమనించి, వాటికున్న చైతన్యాన్ని గుర్తించి సరిగ్గా ప్రయోగించి వైజ్ఞానిక నాయకత్వాన్ని దేశానికి ప్రసాదించాల్సిన బాధ్యత కవికి ఉందని చెప్పే మేనిఫెస్టో ఇది. కవితా శిల్పం ఎలా ఉండాలో ఈ కావ్య శాస్త్రంలో " కవిత్వం శబ్ద శిల్పమా?" అనే ప్రకరణలో విపులంగా చర్చించారు.. ఈ కావ్య శాస్త్రంలో విశ్వవ్యాప్తమైన ప్రాక్పశ్చిమ కవుల రసవత్ కావ్య ఖండికలను, కవితా సిద్ధాంతాలను చర్చిస్తూ సుమారు 60 ఏళ్ల క్రితమే అక్షరీకరించిన ఆధునిక వైజ్ఞానిక ఉద్యమ కావ్య శాస్త్రం కవిసేన మేనిఫెస్టో. కవిత్వం అంటే జన్మతః వచ్చే ప్రతిభా కాదని అది ఒక విలక్షణ అనుభూతి అని తీర్మానించింది. కవిత్వం ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో సుదీర్ఘంగా చర్చిస్తూ అనేక ప్రామాణిక గ్రంథాలను, కవులను ఉటంకిస్తూ శేషేంద్ర శర్మ చేసిన రచన. అన్ని కాలాలకు వర్తిస్తుంది. అక్షర యోధులకు దిశానిర్దేశం చేయడానికి ఆ మహోన్నత స్వాప్నికుడు రూపకల్పన చేసిన వైజ్ఞానిక ఉద్యమ దీపిక కవిసేన మేనిఫెస్టో.

శేషేంద్ర తన కవిత్వాన్ని ఉద్యమ బాటలో నడిపారు. అందుకు ఉదాహరణ " ఈ చెట్లు పూలు ఎందుకు పూస్తాయి, ఈ నికృష్టపు నాగరికత విడిచే బొగ్గు పులుసు వాయువు పిలుస్తూ ఇవి బుల్లెట్లు ఎందుకు పూయవు? అని కేక వేస్తా! కలుషితమైన ఈ సమాజం నిష్కల్మషం కావాలంటే ఈ నికృష్టపు నాగరికతను వదిలించాలంటే ఇక్కడ ప్రకృతిలో మార్పు రావాలి. ఇక్కడి చెట్లు పూలకు బదులు బుల్లెట్లను పూయాలని శేషేంద్ర అనడంలో విప్లవం ఒక్కటే పరిష్కార మార్గం అని భావించినాడు. అందుకే " కవిత్వం వద్దు వెయ్యి ప్రళయాలు దట్టించిన ఒక బాంబు ఇవ్వండి" అంటాడు. ప్రశ్నించడం, కేకలు వేయడం, అరవటం ఇవన్నీ విప్లవ ఉద్యమంలో నడిచే వారికి ఊతమిచ్చే పదాలే. శేషేంద్ర కవితా రచనలో ఇవి అనేకం కనిపిస్తాయి. " కొత్త పద్యాలల్లుతున్న, జీర్ణం కాకుండా నేనున్న ఆ నగరాలకు ఆవల నా ఆత్మ, తన నులివెచ్చని కోర్కెలు పొదుగుతున్న ఆ అడవుల కావాల" అని అనడంలోనూ శేషేంద్ర మనసులో ఉన్న విప్లవోద్యమ భావాలు స్పష్టంగా కనిపిస్తాయి.

1994 లో వచ్చిన జనవంశం, ఆధునిక మహాభారతము అనుబంధ కావ్యం. పూర్వకాలంలో ప్రతి ఇతిహాసానికి ఒక అనుబంధ కావ్యం ఉండేది .

వాల్మీకి రామాయణానికి ఉత్తరకాండ, వ్యాస మహాభారతానికి హరివంశం, హోమర విరచిత ఇతిహాసానికి ఆడిసి అనుబంధ కావ్యాలు లాగా, ఇతిహాస కావ్య రచన ప్రక్రియనుసారంగా ఆధునిక మహాభారతానికి అనుబంధ కావ్యంగా ఈ జనవంశం వచ్చింది అ ని ప్రకాశకీయం (పుట. 31) స్పష్టం చేస్తోంది. ఆధునిక మహాభారతము శేషేంద్ర వచన కవిత సంకలనాల పుష్పగుచ్ఛం. కానీ అనుబంధ కావ్యమైన ఈ జనవంశం లో ఛందోబద్ధ పద్యం, గేయం, గీతం, వచన కవిత, మినీ కవిత శేషేంద్ర సృజించిన చమత్కారిక అన్ని కవితా రూపాలు ఉన్నాయి. నగరం చంబల్ వ్యాలీ, గ్రామం దేశానికి కూలి వంటి ఖండికలు ఈనాటి సామాజిక వ్యవస్థను తీవ్రంగా ఖండిస్తున్నాయి. శేషేంద్ర లోని దార్శనిక పార్శ్వం ఎంతో నిగూఢమైనది. కాలం గురించి రాస్తూ, ఒక కొమ్మ గురించి ఇలా అంటారు" నగ్న శాఖే గాని కాలం అందులో ప్రవహిస్తుంది రాగి తీగలో విద్యుత్తులా ".ఈయన రాసిన సాహిత్య వ్యాస సంపుటి "కాలరేఖ "కు 1994 లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది . ఇందులో ప్రాచీన సంస్కృత నాటకం, ప్రాచీన గ్రీకు నాటకం, తులనాత్మక సాహిత్యం, శాస్త్రీయ కవిత్వం మరియు అరబిందో యొక్క సావిత్రి వంటి విషయాలు మనకు అగుపడతాయి. ఆయన సాహిత్య కృషికి కాలరేఖ ఒక మంచి నమూనా. 2004లో నా దేశం నా ప్రజలు నోబెల్ బహుమతికి నామినేట్ చేయబడింది. ప్రపంచ స్థాయిలో సాహిత్య రంగంలో నోబెల్ పురస్కారానికి ఎంపిక జాబితా వరకు వెళ్లిన ఏకైక తెలుగు కవి శేషేంద్ర. 1993లో సుబ్రహ్మణ్య భారతి రాష్ట్రీయ సాహిత్య పురస్కారం, రాష్ట్రీయ సంకృతి ఏక్తా పురస్కారం, 1994లో తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, భారత ప్రభుత్వ "రాష్ట్రేంద్రు" బిరుదు, కలకత్తా రాష్ట్రీయ హిందీ అకాడమీ అవార్డులు లభించాయి.

శేషంద్ర తెలుగు సాహిత్య లోకానికి దాదాపు 55 సంవత్సరాల సుదీర్ఘకాలం సేవ చేశారు. ఆయన కలం నుంచి జాలువారిన మరొక ఆణిముత్యం ఒకే ఒక సినీ గేయం ముత్యాలముగ్గు చిత్రంలోని, "నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది కన్నుల్లో నీరు తుడిచి కమ్మటి కల ఇచ్చింది." సినీ ప్రేమికుల హృదయాల్లో ఇప్పటికీ నిలిచింది.

సినీ సాహిత్యంలో ఆయన కొనసాగి ఉంటే ఎన్నో మనసును రంజింపజేసే గీతాలు ఆయన కలం నుంచి జాలు వారేవి.

కానీ ఆయన రాయాలని అనుకోక పోవడం సినీ సాహిత్య లోకానికి తీరని లోటు. ఆయన సాహిత్య సేవకు తగిన గుర్తింపు ప్రభుత్వం తరపున రాలేదని సాహితీ లోకం అంటుంది. "జ్ఞానపీఠం" పురస్కా రానికి అన్ని అర్హతలు ఉన్నను ఆ పురస్కారాన్ని అందించకపోవడం ఆ సంస్థకే అగౌరవం.

అయినను అసంఖ్యాక సాహిత్య పాఠకుల, ప్రేమికుల హృదయాల్లో సూర్యచంద్రులు ఉన్నంతవరకు నిలిచే ఉంటారు మన విప్లవ భాషా విధాత.



**-తోట రంగమణి**
ఎస్.ఏ.ఇంగ్లీష్
జి.ప.ఉ. పాఠశాల,దర్భరేవు
నరసాపురం,పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 97018 41884

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1608వ రోజు 'మౌనవ్రతం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'మౌనవ్రతం' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,9441046839

### మౌనమేలనోయి!

మనసు బాధల సుడిగాలిలో చిక్కుకుని
తాళలేని వేళలో మౌనమే ఔషధం
తన్ను తాను చక్కదిద్దుకునే అద్దం.
గడబిడల గవాక్షానికి
మౌనమే వెన్నెలాకాశం
అనుకోని నిందలు
నిజాన్ని సమాధి చేస్తుంటే
కుదురుకునే పెరుగు తోడుకు
మౌనాలంకారమే
సత్యం చంద్రోదయం.
విషపు కోరల శత్రువు
అసహజ పడగలపై
మౌనం బద్ధలైతేనే
శక్తి వజ్రాయుధమయేది
పోరు నష్టంలోనే
పొందాలి విజయలాభం.
మౌనమే ధ్యాన సాధనకు మందిరం
శాంతి వీచికల కలువల
సరస్సు ఉద్భవం
శరీరారోగ్య ఆనందాలకు
ఆత్మీయ సౌధం.
అతి ఏదీ దరి రాని బతుకు దారే
ప్రకాశం
మంచి చెడుల మధ్య విచక్షణే
బతుకు సారం.

- ఏడెల్లి రాములు

### దివ్యాస్త్రం

మౌనవ్రతం
సృష్టిలో మహామంత్రం
సర్వకార్య సాఫల్యానికి ఓ తంత్రం
ఈర్ష్య, ద్వేషం రాకుండా చేసే సూత్రం
సమస్యలకు పరిష్కారం ఈ వ్రతం
శాంతి సామరస్యతకాధారం.
ఆవేశకావేశాలు నియంత్రించేది
పగ ప్రతీకారాలు తుంచి వేసేది
స్నేహ సౌభ్రాతృత్వాలు పెంచేది
మనుషులు మనసులు కలిపేది
మౌనమంత్రమని మరువకు.
హృదయంలో ఉక్రోషం ఉబికితే
గుండెలోన విద్వేషం రగిలితే
శత్రువు పట్ల క్రోధముప్పొంగితే
మదిలో అసహనం చెలరేగితే
మౌనంతో అన్ని మాయం.
అన్యాయం వికటాట్టహాసం చేస్తే
సమాజంలో అవినీతి తాండవిస్తే
అక్రమార్కులు నిత్యం బరితెగిస్తే
దుష్ట దుర్మార్గులు దాష్టికాలు చేస్తే
మౌనంగా చూస్తూ ఊరుకోకు.
హింసకు తావివ్వని మహాస్త్రమే
రక్తము చిందించని గొప్ప శస్త్రమే
సన్మార్గంలో నడిపించే ఓ శాస్త్రమే
విధ్వంసాలనరికట్టే బ్రహ్మాస్త్రమే
మౌనమంత్రం దివ్యమైన అస్త్రం.

-కాటేగారు పాండురంగ విఠల్

### మానసిక యోగ

నాలుక చేసే అనార్థాలకు చెక్
మానసిక ఆరోగ్యానికి ప్లస్
మౌనం అర్థాంగీకారం
మౌనంగా ఉంటే చాలదు
దానికి ధ్యానం తోడు కావాలి
పరధ్యానం కాదు
పరమాత్మ లేదా ప్రకృతి
దృష్టి
అరికట్టగలవు అనర్థాలను
నరం లేని నాలుక
సృష్టించే విధ్వంసం
నివారించవచ్చు
రాజకీయనాయకుల
తిట్లపురాణాలకు బ్రేక్
బ్రేకింగ్ న్యూస్ కు
పడుతుంది స్టాప్
ఉపాధ్యాయుడు తరగతి గదిలో
న్యాయ వాది కోర్టులో
రోగి డాక్టర్ వద్ద
వద్దు వద్దు మౌనం
మిగతాచోట్ల
ఆరోగ్యానికి శ్రీ రామ రక్ష.

-శేషారావు వైద్య

### మౌనం బంగారం

వారంలో ఒక రోజైనా మౌనం
వతంలా చేయాల్సిందే
"మౌనం బంగారం మాట వెండి"
ఎంత బంగారం మూట మనది!
విద్యార్థికి మౌనం వజ్రాయుధం
భార్యాభర్తల మౌనం
తుఫాను ముందు ప్రశాంతత.
మౌనం, అహింస కవలలే
గాంధీజీ సాధించాడెన్నెన్నో
వరాలీ మౌన మంత్రంతో
అహింసాయుధంతో.
న్యాయం కోరే వారు
మౌనంతో ఏమీ సాధించలేరు
అవసరాన మౌనమహామంత్రం
పెళ్లికి ముందు, మాట తర్వాత
మౌనమెంత మహోపయోగం.

-ప్రశాంతి రేవూరి

### భూషణం

మౌనం అర్థాంగీకారం
అనే వారొకప్పుడు
ఆ మౌనాన్నే వ్రతంగా
స్వీకరిస్తే లాభాలెన్నో.
అదొక సదాచారం
పెద్దలకి ఆచరణీయం
పిన్నలకి చాదస్తం
ఆచరిస్తే ఆపదల నుంచి రక్షణ.
అనవసర ఆలోచనలు దూరం
వాగ్వివాదాలు దూరం
సాధారణ ఆచారం
అసాధారణ ఫలితాలు
యోగాలో ఒక ప్రక్రియ.
సాధనతో ఎన్నో సత్ఫలితాలు
పెరిగే స్వీయ క్రమశిక్షణ
పెరిగే శారీరక మానసిక స్వస్థత
అనవసర మాటలతో
అభాసుపాలవడం నుంచి రక్షణ.
ఆలోచనలపై నియంత్రణ
భావోద్వేగాల అదుపు
సృజనాత్మకతతో సత్ప్రవర్తన
సహనంతో సర్వసాధన.

-మోటూరి శాంతకుమారి

### మౌనభరిత మనసు

చిన్న చిన్న తగాదాలే
పెద్దగా మారి
అవమాన అనుమానాలతో
మాటల యుద్ధంలో
మరణించిన మనసు
మౌనభరితమవుతుంది.
బాధ్యత ఎరిగిన మనుషులు
మాట మాట పెంచుకొని
కుటుంబం కూల్చుకోలేక
మౌనంగా ఉంటారు.
మౌనం
ఎంత మంచిదో అంత చెడ్డది
కొందరు ఎన్ని అన్నా
మౌనంగా పోతున్నారు అంటే
వాళ్ళ మౌనానికి
బలి కాబోతున్నారు పగోళ్లు అని అర్థం.
గల గల గంట కొట్టినట్లు మాట్లాడితే
వాళ్ళ మనసులో ఏమి ఉండదు
మౌనంగా ఉండే మనుషులు
మాట్లాడకుండా
చూపులతోనే చంపుతారు
చేతలతో విసిగిస్తారు.
మౌనం
గొడ్డలి కన్నా పదును
విషం కన్నా చేదు
మౌనం
తనను తాను హింసించుకుంటూ
ఎదుటివాళ్ళను కూడా హింసిస్తుంది.
అందుకే
మౌనం ఎంత మంచిదో
అంత చెడ్డది కూడా.

-పొన్నాల ధనమ్మ

కాలం
బలం
శాంతి...మరెన్నో!.

-డా.సి.వసుంధర

### శత్రువినాశనం

హెచ్చులు పోతున్నా
రెట్టిస్తున్నా
పరిహాసం శృతి మించుతున్నా
క్రోధంతో పళ్ళు నూరుతున్నా
ద్వేషం మోసం
కపట నాటకాలతో
ప్రేమను దోచేస్తున్నా
పెదవుల నవ్వులు చిలికిస్తూ
ఈర్ష్యా అసూయతో
మండిపోతున్న మనుషులు నీ చుట్టూ
వెంటపడి వేధిస్తూ..
తీయని మాటలతో వల వేస్తూ
ధన మానాలను దోచేస్తున్నా
బయటికి కనిపిస్తారు
పెద్ద మనుషులుగా చెలామణీ
అవుతూ
నీతుల రీతులను తప్పిస్తూ..
విలువల వలువలు వొలిచేస్తూ
తల ఎగరేస్తూ తిరుగుతున్నారు.
మేకవన్నె పులులు
జిత్తుల మారి నక్కలు
వివేక విచక్షణలను కోల్పోతూ
నరాధములు
తనవారినే చంపుకొంటున్నారు.
దూరం దూరం
నీ చుట్టూనే ఉన్నారు
గోతులు తీస్తూ.
అవకాశం దొరికితే కాటేద్దామని
కాపుకాచుకొని ఉన్నారు
జిత్తులమారి నక్కలు
బొక్కలను కొరుక్కు తింటున్నారు
ముక్కలు ముక్కలుగా నరికేస్తూ.
ఈనాటి మాయాలోకంలో
మూర్ఖులతో పోటీపడే కన్నా
మాట్లాడి శక్తిని కోల్పోయేకన్నా
ఉన్నతం
ఉత్తమోత్తమం
మహోన్నతం
మౌనవ్రతం
మానసిక శారీరక ఆరోగ్యానికి
దివ్యమైన ఔషధం.

-పి.పద్మావతి

### ఉత్తమ ఔషధం

మనసు మరీ వేదన చెందిన వేళ
చెల్లాచెదరుగా ఆలోచనలతో ఎద
నిండిన వేళ,
నీ అనుకున్న వాళ్లు
నిన్నే అపార్థం చేసుకున్న వేళ
నీది అనుకున్నది వేరొకరికి దక్కిన
వేళ.
ఎంతో ఆశపడిన
అమృతంవంటి విషయం
విషమైన వేళ,
నీ విలువ తెలియక
వెనక చేరి
వెక్కిరించేవాళ్ళు ఉన్నవేళ.
ఇలాంటి సమయాల్లో
మౌనం వీడి పోట్లాడితే పోయేది
నీ ప్రశాంతతే.
వచ్చేలాభం వట్టిదే.
మౌనం అంటే
మనిషి అత్యంత మితంగా
మాట్లాడడం
నిత్యజీవన విధానంలో మౌనంతో
సమానం
పూర్తి మౌనం యోగులకే సాధ్యం
అనవసరపు ప్రశ్నలు
అర్థరహిత వాదనలు
ఆతృతతో
అందరి విషయాలలో
తలదూర్చడం లాంటివి మాని
మనపని మనం చేసుకొంటూ
పోతుంటే
అదే మౌనం
అది మిగులుస్తుంది మనకు

### మౌనం అవసరమే

కం. మౌనము కలహమునాపును
జ్ఞానపుటాలోచనకు పునాదియునగుచున్
స్థానము స్థాయిని పెంచును
మానమునభిమానమగును మైత్రినినిలుపున్.
ఉ. మౌనము సంద్ర మందు గల మార్మికమౌ బడబాగ్నిరీతిగా
ప్రాణము తీసినంత పనిభారము, శక్తిని కల్గునొక్కచో
కానియసాధ్యమైన ఘనకార్యము నిర్వహణమ్ము లోపల
న్దేనియమమ్ములున్న దాటుటకు నేస్తముగా సహాయకారియౌ.
కం. మానసమేకాగ్రతకై
ధీనవనాడుల తిరుగును తేజము నింపున్
మౌనము ధ్యానము యోగము
మౌనముతో భక్తిశక్తి మార్పును కోరున్.
ఉ. మౌనము గుంభనమ్మునగు మాటల చేతల వక్రబుద్ధులన్
హీనులుగాను గుర్తెరిగి హేయముగానమానపర్చగా
దీనులజేసి తప్పులపుదిద్దుకు మాంచి మార్పుజేయగన్
మానసవీణ మాధురుల మక్కుపెంచగ మందు రీతిగన్.

-మాడుగుల నారాయణమూర్తి

## వడ్ల కుప్పల తిప్పలు

సాగు రుణాల తిప్పలు
పంటకు పట్టి చీడపీడలు
అకాల వర్ష వడగళ్ల నష్టాలు
చెమట ధారలే సాగు నీళ్లు
నకిలీ విత్తనాల విపరీతాలు
ప్రతికూల వాతావరణ లీలలు
చలికాలంలో భీకర ఎండలు
ఎండాకాలంలో వరదల లీలలు
రైతు పాలిట అష్ట దిగ్బంధనాలు
పంట కోత మిషన్లకు నిరీక్షణలు
కల్లంలో తిష్టవేసిన వడ్ల కుప్పలు
అకాల వానల బోబూచులాటలు
అకస్మాత్తుగా అకాల వర్ష వడగళ్లు
కొట్టుకు పోతున్న కాయకష్టాలు
తూకంలో మోసాల నీచ లీలలు
రైతు నోట్లో మట్టి కొట్టే తరుగులు
నిస్సహాయ రైతు కంట కన్నీళ్లు
పట్టపగలే దర్జాగా రైతుల దోపిడీలు
అన్నదాత అవస్థల కుప్పలు
ఆదుకునే నాథులకు కరువులు
నినాదంలోనే 'జై కిసాన్' ధ్వనులు
అక్కరకురాని రైతన్న ఆవేదనలు
మట్టి మనిషి శ్రమను దోపిడి చేస్తే..
పుట్టగతులుండవు రోతగాండ్లకు !



-మధుపాళీ
9949700037

## తగ్గేదేలే

మిడిసిపడుతున్న-పసిడి ధరలతో
మధ్య తరగతి గుండెలు దడదడ
తగ్గేదేలే అంటూ లక్ష మార్కు దాటితే
వెనుకంజ వేయడం సహజం..
డబ్బున్నోళ్లు ఇంకా ఇంకా కొంటూ
ధరను తారస్థాయికి తీసుకెళుతుంటే
ఆడపిల్లకు తాళిబొట్టు కొనేదెలా అని
తల్లడిల్లుతోంది పేద తండ్రి హృదయం!



-శర్మ సీహెచ్.
చరవాణి: 9440587567




## ఘనంగా తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం


పురస్కార గ్రహీతలతో వీసీ మునిరత్నం నాయుడు, వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు తదితరులు

హైదరాబాద్, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి):సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం-2023 సంవత్సరానికి గాను తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు అక్టోబర్ 29 బుధవారం సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు. వర్సిటీలోని ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీ తెలుగు వర్సిటీ వీసీ మునిరత్నం నాయుడు ముఖ్య అతిథిగా హాజరై పురస్కార గ్రహీతలను రూ.20,116 నగదు పారితోషికం, ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం కార్యక్రమ విభాగాధిపతి ఎన్.రమేష్ సుంకసారి, రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు, రింగు రామ్మూర్తి పాల్గొన్నారు.

### పురస్కార గ్రహీతలు వీరే

ఓజల నరహరిశర్మ (పద్యకవిత), విశ్వర్షి వాసి (వచన కవిత), డా॥ఏనుగు నరసింహారెడ్డి (గేయ కవిత), డా॥ఎం. హరికిషన్ (బాలసాహిత్యం), డా॥టీ. సంపత్‌కుమార్ (కథ), ఆచార్య పులికొండన సుబ్బాచారి (నవల), ఆడెపు లక్ష్మీపతి (సాహిత్య విమర్శ), రావుల పుల్లాచారి (నాటకం), డా॥టి.సి.వసంత (అనువాదం), ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి (వచన రచన), డా॥ జంధ్యాల కనకదుర్గ (ఉత్తమ గ్రంథం), తదితరులకు సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు.

## పాత్రికేయులకు స్ఫూర్తి పాఠం వినయ్‌కుమార్ జీవితం

– జస్టిస్ రాధారాణి


"పేపర్ బాయ్ టు ఎడిటర్" పుస్తకావిష్కరణలో జస్టిస్ రాధారాణి, కె. శ్రీనివాస్,నాచార్య మాడభూషి శ్రీధర్, అల్లం నారాయణ, తెలుకపల్లి రవి, వినయ్‌కుమార్ పాశం యాదగిరి తదితరులు.

హైదరాబాద్, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి): ఈ తరం జర్నలిస్టులకు వినయ్ కుమార్ ఆత్మకథ ఒక స్ఫూర్తి పాఠం అని తెలంగాణ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి రాధారాణి అన్నారు, సీనియర్ ఎడిటర్ ఎస్. వినయ్‌కుమార్ జీవిత చరిత్ర **"పేపర్ బాయ్ టు ఎడిటర్"** పుస్తకాన్ని బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జస్టిస్ రాధారాణి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అత్యంత పేదరికంతో పోరాడే నాయీ బ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చిన వినయ్ కుమార్ ఐక్యరాజ్య సమితిలోని వివిధ దేశాధినేతల ప్రసంగాలు రిపోర్ట్ చేసే స్థాయికి ఎదగడం అసాధారణమైన విషయంగా కొనియాడారు. పేపర్ బాయ్‌గా మొదలై ప్రజాశక్తి లాంటి సైద్ధాంతిక భూమిక కలిగిన ఓ పత్రికకు ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తించడమంటే మాటలు కాదని అన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షుడు కె. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రూఫ్ రీడింగ్ నుంచి పేజీ మేకర్ వరకు, పరిశోధనాత్మక జర్నలిజం నుంచి మకుటాయమాన అనువాద రచనల వరకు, పరిణితి చెందిన పాత్రికేయ ప్రముఖుడు వినయ్‌కుమార్ అంటూ ప్రశంసించారు. ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు అల్లం నారాయణ మాట్లాడుతూ వినయ్‌కుమార్‌ను కదిలే విజ్ఞాన సర్వస్వంగా అభివర్ణించారు. సభాధ్యక్షత వహించిన సమాచార హక్కు మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ ఈ పుస్తకం జర్నలిస్టులకు అత్యంత అపురూపమైనదని అని చెప్పారు. ప్రజాశక్తి ఎడిటర్‌గా వినయ్‌కుమార్ అందించిన సేవలను తెలకపల్లి రవి గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, కంబాలపల్లి కృష్ణ, వినయ్‌కుమార్ భార్య సుజావతి, కుమార్తె ఉజ్వల తదితరులు పాల్గొన్నారు.

చివరిగా వినయ్‌కుమార్ స్పందన తెలియజేశారు.

# వాసి కెక్కిన ప్రవాస రచయిత



కవులు, రచయితల రచనలు సమాజ దిక్సూచిగా నిలవాలి, ఆదర్శప్రాయం కావాలి. చదివిన వారిలో ప్రేరణను కలిగించాలి, స్ఫూర్తిని అందించాలి. వారి రచనల మాదిరిగానే కొందరు రచయితల జీవితాలు కూడా సమాజాన్ని అత్యంత ప్రభావితం చేస్తాయి. అటువంటి రచయితలలో చెప్పుకోదగ్గ వారు శ్రీ అంబల్ల జనార్దన్ గారు.

ఆయన జీవితాన్ని గమనిస్తే ఎన్నో అసాధారణమైన విషయాలు కనిపిస్తాయి. అవి నిజంగా మనల్ని అబ్బుర పరుస్తాయి. తెలుగు పట్ల ఆయనకున్న మమకారం, తెలుగు సృజనాత్మక సాహిత్యం పట్ల ఆయన పెంచుకొన్న మక్కువ, కొనియాడదగినవి. అదేముంది? చాలామంది తెలుగు భాషాప్రేమికులు, తెలుగు భాషాభిమానులు ఉంటారు కదా, అని మనం అనుకోవచ్చు, కానీ ఆ భాషాభిమానమే ఆ భాషాభిరుచియే ఆ సృజనాత్మక సాహిత్య పఠనాసక్తియే ఆయనను ఒక గొప్ప కవిగా, రచయితగా మలిచిన తీరు, ఆయన జీవితంలో ఒక గొప్ప మలుపు. ఆయన సాధించిన పెద్ద గెలుపు. అందుకే ఆయన గురించి మనంమాట్లాడుకోవాలి, మాట్లాడుకొంటున్నాం. ముందు ముందు కూడా మాట్లాడు కొంటాం.

ఒక కవికి గాని, ఒక రచయితకు గాని ఇంతకంటే కావలసింది ఏముంటుంది? సాహితీలోకంతో ఒక సుస్థిరమయిన స్థానం సంపాదించుకోవడం తప్ప.

అంబల్ల జనార్దన్ గారు పుట్టింది తెలుగు నేల పైనే అయినా పెరిగిందంతా మహారాష్ట్రలోని ముంబయి నగరంలో. పాలు త్రాగే ప్రాయంలోనే ఆయన కుటుంబం జీవనపాధికోసం, ఇక్కడి నుంచి అక్కడికి వలస వెళ్ళింది. అక్షరాస్యతా పరంగా, ఆర్థికంగా అంతగా అభివృద్ధి చెందని కుటుంబ నేపథ్యం ఆయనది. బహు కుటుంబీకులైన తల్లిదండ్రుల కుటుంబ పోషణా భారాన్ని మోస్తూ, అనునిత్యం సాంసారిక సమస్యలతో బ్రతుకు పొరాటం చేస్తూ ఉన్న వాతావరణం లో, ఆయన జీవితం కొనసాగింది. ఆయన జీవితం వడ్డించిన విస్తరి కాదు. అయినా ఈ నాడు ఆయన ఈ స్థాయికి రావడం వెనుక ఉన్న ఆయన కృషి, పట్టుదల, సాధన, ఆత్మస్థైర్యం మెచ్చుకొన దగినవి, చెప్పుకోదగినవి.

వీరి పాఠశాల విద్య అంతా ముంబయిలోనే కొన సాగినప్పటికీ, తెలుగు ప్రాథమిక విద్యా స్థాయి నుంచి చదవడం వీరికి కలిసి వచ్చింది. ఆపై స్థాయి విద్య, ఎం.కాం,, ఎల్.ఎల్.బి., వంటి కోర్సులన్నీ ఆంగ్ల మాధ్యమంలోనే కొనసాగించారు.

బ్యాంక్ ఉద్యోగంతో ప్రారంభమైన వారి ఓద్యోగిక జీవిత ప్రస్థానం, అంచెలంచెలుగా ఎదుగుతూ ఒక ఫైనాన్స్ కార్పొరేషన్ లో 'హెడ్-క్రెడిట్-ఎడ్మినిస్ట్రేషన్' పదవి దాకా చేరింది.

ముంబయి వంటి మహా నగరంలో పెరిగి నందువల్ల వీరు హిందీ, ఇంగ్లీషు, గుజరాతి వంటి భాషల్లో మంచి ప్రావీణ్యాన్ని సాధించారు. చిన్నతనం నుంచే తెలుగు భాష అంటే ఇష్టమని చెప్పుకొన్నాం. ఆ ఇష్టం క్రమంగా తెలుగు పత్రికలు, పుస్తకాలు చదవడం వైపు దారి తెసింది. ముఖ్యంగా కథలు, కవిత్వం నవలలు వంటి తెలుగు సృజనాత్మక సాహిత్యం విరివిగా చదివేవారు. వీరు పనిచేసే బ్యాంక్, ముంబయిలోని వీరి నివాసం నుంచి చాలా దూరంలో ఉండడం, ఉదయమే స్థానిక రైళ్లలో గంటల కొద్ది ప్రయాణం చేసి ఆఫీసుకి చేరి, తిరిగి సాయంత్రం ఇంటికి చేరడానికి మళ్ళీ రైళ్ళల్లో గంటల ప్రయాణం వారికి బాగా కలిసి వచ్చింది. ఈ రాను పోను రైలు ప్రయాణలలోని సమయాన్ని అంతా పత్రికలు, పుస్తకాలు చదవడంతో గడిపే వారు. అట్లా బాగా చదివే గుణం వీరిని కలం పట్టి రచనలు చేయడానికి పురికొల్పింది.

నాలుగైదు దశాబ్దాల వీరి నిర్విరామ రచనా ప్రస్థానంలో ఇంతవరకు ఎనిమిది కథా సంపుటాలు, నాలుగు కవితా సంపుటాలు, ఒక విభిన్న సంపుటి 'మహా రాష్ట్రలో తెలుగు వారు' అన్నే ఒక పరిచయాత్మకమైన పరిశోధన గ్రంథం వంటి పుస్తకాలు వెలుగులోకి వచ్చాయి. 1998 లో వచ్చిన 'బొంబాయి కథలు', 2001లో వచ్చిన 'బాంబాయి నానీలు' వీరి మొట్ట మొదటి కథ, కవితా సంపుటులు. ఆనాటి నుంచి ఈనాటి దాకా వీరు ఎత్తిన కలం దించకుండా రచనలు చేస్తునే ఉన్నారు. బడుగు జీవితాల వ్యథలు, మధ్య తరగతి మనుషుల సమస్యలు, సామాజిక స్థితిగతులు, వీరి రచనలలో చిత్రితమౌతాయి. ముఖ్యంగా వలస జీవుల వెతలు కథలుగా మలచడంలో వీరు సిద్ధహస్తులు. పాత్రచిత్రణలో, ఇతివృత్తాల ఎంపికలో సహజత్వం ఉట్టిపడుతుంది. తెలంగాణ మాండలిక భాషలోని సొగసులు, ముంబయి మహానగర సంక్లిష్ట జీవన విధానం, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, ఆహార విహారాలు మొదలైనవన్ని ఒక ప్రత్యేకతను తెచ్చిపెట్టి వీరి రచనలను ఒక ఉన్నత స్థాయిలో నిలబెట్టాయి.

తెలుగేతర భాషా సమాజంలో పెరిగి, స్థిర పడి, తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేసిన సాహితీ విద్యార్థి కాకపోయినా, తెలుగు అధ్యాపక వృత్తిలో కొనసాగక పోయినా, ఒక తెలుగు కవిగా, రచయితగా ఎదిగి లబ్ధప్రతిష్టులు కావడం అంబల్ల జనార్దన్ గారి ప్రత్యేకత. కొత్తగా కలం పట్టి రచనలు చేయాలను కొనే వారు వీరి నుంచి స్ఫూర్తిని పొందాలి. తెలుగు రచనాలచక్రం గర్వించ దగిన రచయిత శ్రీ అంబల్ల జనార్దన్ గారి వజ్రోత్సవం మరియు వీరి వివాహ స్వర్ణోత్సవం సందర్భంగా మనస్ఫూర్తిగా అభినందిస్తూ, శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. వీరు పదికాలాల పాటు సుఖశాంతులతో ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాను.

(అంబల్ల జనార్ధన్ గారి వజ్రోత్సవం మరియు వివాహ స్వర్ణోత్సవం సందర్భంగా...)



**-ఆచార్య టి. గౌరీ శంకర్**
విశ్రాంత రిజిస్ట్రార్
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం

# యుద్ధాలతో మారణహోమాలు, పర్యావరణ విధ్వంసాలు !

యుద్ధాలు, సాయుధ సంఘర్షణలు అంటే మారణహోమమే. గాయపడిన సైనికులు, పౌర సమాజ అభాగ్యుల హాహాకారాలే. యుద్ధాల్లో ఆస్తుల ధ్వంసం, మౌళిక వసతుల వినాశనం తప్పనిసరి అని మనకు తెలుసు. యుద్ధాలు లేదా సాయుధ సంఘర్షణలు జరిగినపుడు ప్రపంచ మానవాళికి తెసిసేది మరణించిన వారి సంఖ్య, గాయపడిన ఆసుపత్రుల పాలైన ధ్వనుల వివరాలు, కూలిన భవనాలు, దెబ్బతిన్న మౌళిక వసతులు మాత్రమే ప్రచారంలోకి వస్తాయి. నగరాలు నెల మట్టం అవుతాయి. ఈ అపార నష్టాలతో పాటు యుద్ధాల వల్ల పర్యావరణానికి అపార నష్టాలు జరగడం కొనసాగుతున్నాయి. యుద్ధాలు జరిగినపుడు జల, వాయు, నేల కాలుష్యాలు నమోదు అవుతాయి. వ్యవసాయం కుంటుబడుతూ, ఆ ప్రదేశాల్లో ఆహార అభద్రత పెరుగుతుంది. జీవనోపాధులు పలుచబడ తాయి. ఆకలి కేకలు పెరుగుతాయి. వలసలతో పర్యావరణ క్షీణత పెరుగుతుంది. అడవులు తరిగిపోతాయి. వన్యప్రాణుల నష్టం జరుగుతుంది. సహజ వనరులు లేదా గనులు విచ్ఛిన్నం అవుతాయి. చమురు పరిశ్రమలు దెబ్బతింటాయి. కలప, వజ్రాలు, బంగారం, విలువైన ఖనిజాల సంబంధ కార్యకలాపాలు దెబ్బతింటాయి.

యుద్ధాలు, సాయుధ సంఘర్షణల్లో పర్యావరణ దోపిడీని నివారించే అంతర్జాతీయ దినోత్సవం:

గత ఆరు దశాబ్దాల్లో జరిగిన 40 శాతం సంఘర్షణల్లో పర్యావరణం అపార నష్టాలను మూటకట్టుకొని, రేపటి తరం ఆరోగ్యకర జీవితాలను ప్రశ్నార్థకం చేస్తున్న విషయాలను గుర్తించిన ఐరాస జనరల్ అసెంబ్లీ 2001లో తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 06 నవంబర్ రోజున "యుద్ధాలు, సాయుధ సంఘర్షణల్లో పర్యావరణ దోపిడీని నివారించే అంతర్జాతీయ దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఫర్ ప్రివెంటింగ్ ది ఎక్స్‌ప్లాయిటేషన్ ఆఫ్ ది ఎన్విరాన్‌మెంట్ ఇన్ వార్ అండ్ ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్)" పాటించడం ఆనవాయితీగా మారింది. యుద్ధాల సమయంలో పర్యావరణ వ్యవస్థల సహజత్వాలను కాపాడడం, సహజ వనరుల సుస్థిర నియంత్రణ చేయడం, శాంతి స్థాపన చర్యలు తీసుకోవడం, పర్యావరణ ఆరోగ్య సంరక్షణకు నిధులు కేటాయించడం లాంటి అంశాలను ప్రచారం చేయడం జరుగుతున్నది. ఈ మహత్తర బాధ్యతలను పౌర సమాజం, ప్రభుత్వాలు, సంస్థలు చేతులు కలిపి పర్యావరణ విధ్వంసం జరుగకుండా అడ్డుకోవాలి. శాంతి, భద్రత, సుస్థిరాభివృద్ధి, మానవాళి శ్రేయస్సును కాపాడడం, చట్టపరమైన రక్షణలు కల్పించడం, ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రపంచ స్థాయి సమన్వయం సాధించడం లాంటివి కొనసాగాలి.

యుద్ధాలు జరిగినపుడా బాంబుల మోతలు మోగుతాయి. భూమాత సహజత్వం కాలుషితం అవుతుంది. రసాయన, హెవీ మెటల్ ప్రమాదాలు మీద పడతాయి. అడవుల విధ్వంసం జరుగుతుంది. మట్టి నాణ్యత మంటగలుస్తుంది. నీటి ఎద్దడి వెంటపడుతుంది. పేళని ల్యాండ్ మైన్స్ సమస్యలు ఉత్పన్నం అవుతాయి. మందుగుండు సామాగ్రి మట్టిని కలుషితం చేస్తుంది. యుద్ధాలతో దీర్ఘకాలిక సమస్యలు మానవాళిని తరుముతాయి. యుద్ధానంతరం కాలుష్య నివారణ అత్యంత ఖరీదు అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.5 బిలియన్లు, అనగా 20 శాతం జనాభా సంఘర్షణల విషవలయంలో చిక్కి విలవిల్లాడుతున్నారు. జీవ వైవిధ్యం దెబ్బ తింటుంది. ప్రజారోగ్యం మంటగలుస్తుంది. పర్యావరణ క్షీణత రేపటి బతుకులకు భరోసా పలుచబడుతుంది. ఈ భయానక విషయాలను గుర్తించి పౌర సమాజం, ప్రభుత్వాలు తగు చర్యలను తీసుకుంటూ పర్యావరణాన్ని కాపాడే విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. యుద్ధాలను అంతం చేయడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. మానవ శ్రేయస్సు కేంద్రంగా మన ప్రతి అడుగు సన్మార్గం దిశగా పడాలి.

(06 నవంబర్ "యుద్ధం, సాయుధ సంక్షోభాల్లో పర్యావరణ విధ్వంస నివారించే అంతర్జాతీయ దినోత్సవం" సందర్భంగా)

**-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి**, 9949700037

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న **'బుధవారం బాద్షా'** పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123



నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ

## ఆధ్యాత్మిక ప్రాశస్త్యం

కృత్తికా నక్షత్రంతో కూడి
పున్నమి వెన్నెల వెలుగులు
సంతరించుకున్న మాసం
కార్తీకమై వెలుగొందె.
చిరు చలి గాలులు తాకుతూ
తొలివేకువ ఝామునుంచే
స్నాన జపాదులతో శివశివా
అని స్మరణ చేయించుచూ
భక్తిపారవశ్యమున ముక్తి కలిగించే
పుణ్యప్రదమైన కార్తీకం.
శివకేశవులకు ఆవాసమై
మాసమంతా ప్రతిరోజు
విశిష్ట పుణ్యాన్నిచ్చే కార్తీకం
పురిషెడు నీళ్ళు చిలకరించిన చాలు
పొంగిపోయి ముక్తినిచ్చే
బోళాశంకరుడు
చిన్న తులసీదళం సమర్పించిన
చాలు, మురిసి వరములిచ్చే
నారాయణుడు
చిన్నదీపం వెలిగించిన చాలు
జన్మ జన్మల పాపములు హరించే
కార్తీక మాసం.
దీప,వస్త్ర,సాలిగ్రామ ,స్వయంపాక
దానధర్మాదులతో
జన్మరాహిత్యము కలిగించే
ఏకైక మాసం కార్తీక మాసం.
నదీనదాల స్నానాదికాలు
నోముల,వ్రతాలు,దీక్షలు,
వనభోజనాలు,దీప ప్రజ్వలనాలతో
దేదీప్యమానమై
వెలుగులు చిందించి ముక్తిని,మోక్షాన్ని
ప్రసాదించే కార్తీక మాసం
ఎంతో విశిష్టతతో పరిఢవిల్లేను.

**-కొలచన విజయ భారతి**
హైదరాబాద్

## ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు..



మంథని, నవంబర్ 5: రైతులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా వరి ధాన్యం కొనుగోళ్లు చేపడుతామని మంథని ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న అన్నారు. ఈ రోజు మంథని ఏఎంసీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ ఎక్లాస్ పూర్ సెంటర్ ను కూడా ప్రారంభించారు.

ఈ సందర్భంగా కుడుదుల వెంకన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తారని అన్నారు. కొత్త శ్రీనివాస్‌మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాలను ప్రారనీభించుకున్నామని తెలిపారు. ధాన్యం తడిసినప్పటికి రైతులు ఏ మాత్రం అధైర్య పడవద్దని, ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని అన్నారు.

రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరతో పాటు సన్న వడ్లు క్వింటాల్ కు రూ.500 బోనస్ పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాష్ రెడ్డి డైరెక్టర్లు ఆకుల రాజబాబు, పెద్దిరాజు ప్రభాకర్, రావికంటి సతీష్ కుమార్, లెక్కల కిషన్ రెడ్డి, కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మి-మొండయ్య, దేవల్ల విజయ్ కుమార్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు ముస్కుల ప్రశాంత్ రెడ్డి, తదితరు పాల్గొన్నారు.

## హరిహరుల మాసం..!!

శ్రీవిష్ణు మహేశ్వరులు ఉభయులకు పూజనీయమైన మాసం.
భక్తుల ఆర్తిని తీర్చే భగవదనుగ్రహానికి పాత్రమైన మాసం.
శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన అలంకారార్చనలు.
తులసీ పూజలు,విష్ణువుకు ప్రీతికలిగించే కార్తీక మాసం .
కార్తీక సోమవారాలలో శివ ప్రీతికరమైన అభిషేకాదులు.
నమక చమక రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు.
శివుని అనుగ్రహాన్ని కలిగించి,తీరుస్తాయి భక్తుల మనోభీష్టాలను.
కృత్తికా నక్షత్ర దర్శనం,దీపదర్శనం అత్యంత ప్రాధాన్యం.
కార్తీకంలో నదీ స్నానం అత్యంత ముక్తిదాయకం.
కార్తీక పౌర్ణమినాడు దీప మహోత్సవము,కేదారేశ్వరునికి ప్రీతికరమైన వ్రతములు,ఇస్తాయి శివసాయుజ్యాన్ని.
గోధుమపిండితో ప్రమిదను చేసి ఆవునెయ్యితో దీపం వెలిగించి.
భక్తితో పూజించి,ఆ దీపాన్ని ఇవ్వాలి దానంగా బ్రాహ్మణునికి.
దీపదానం ఏరోజు చేసినా పుణ్యప్రదమే,
దానంతో కలుగుతుంది స్వర్గలోక ప్రాప్తి.
సాలగ్రామ దానం,తులసి దానం వల్ల భూదానం చేసినంత ఫలమని ఐతిహ్యం.
వేకువనే చన్నీటి స్నానం,దీపారాధన,దీపదానం,వనభోజనాలు, బ్రాహ్మణ సమారాధనలు మహా పుణ్యప్రదము.
కార్తీక సోమవార,కేదారేశ్వర వ్రతాలు,ద్వాదశి పారాయణాలు.
కార్తీక వనభోజనాలు, హోమాది కార్యక్రమాలు.
శివకేశవార్చనలు, క్షీరాబ్ది ద్వాదశి నాడు పుణ్యకార్యాలన్నీ మోక్ష సాధనలకు మార్గాలు.
తులసీ దళార్చన విష్ణువుకు,మారేడు దళార్చన శివునికి ప్రీతికరములు.
కార్తీక మాసంలో శివ కేశవులలో
ఎవరిని అర్చించినా ముక్తికి మార్గమని శాస్త్ర వచనం..!!

**-డా. మరుదాడు అహల్యా దేవి**
బెంగుళూరు

## ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ దాడులు

ఇబ్రహీంపట్నం, నవంబర్ 5 : ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు బుధవారం ఆకస్మికంగా దాడులు చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి ఆరోపణలు రావడంతో అధికారులు మెరుపు దాడులు చేశారు.

కార్యాలయంలోకి ఎవరిని లోపలికి రానివ్వకుండా, లోపలి ఉన్న వారు బయటకు రాకుండా గేట్లు మూసి వేశారు. రిజిస్ట్రేషన్ కు వచ్చిన వారిని విచారించారు. రికార్డులు తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే సోదాలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. తమ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏకకాలంలో తనిఖీలు చేస్తున్నామని చెప్పారు.

## నీరుకుల్లలో రోడ్డు ప్రమాదం.. వేగురుపల్లి వాసులకు గాయాలు



కరీంనగర్, నవంబర్ 5: పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల్ల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కరీంనగర్ మండలం వేగురవల్లి గ్రామానికి చెందిన ఇద్దరు అయ్యప్ప మాలదారుణ స్వాములు బత్తిని వీరస్వామి, నందికొండ రెడ్డిలు గూడెం గుట్టకు వెళ్లారు.

అక్కడి నుండి ద్విచక్ర వాహనంపై బుధవారం తిరుగు ప్రయాణంలో నీరుకుల బ్రిడ్జి సమీపంలో వారి వాహనాన్ని కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఇద్దరికీ కాళ్లకు, శరీర భాగంలో తీవ్రగాయాలు కాగా గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో సుల్తానాబాద్ ప్రభుత్వ తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. విషయం తెలుసుకున్న సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

## నీవో వైపు నేనో వైపు

నీవు నన్ను ఇంత ప్రేమగ.
పెదాల మీద చిరునవ్వులు.
నింపుకొని పలకరిస్తున్నావంటే
స్వప్రయోజనం శ్లేషమైన లేదో.
ఉన్నదో అది నీ మనసుకేఎరుక.
నేనైతే లేదనే అనుకుంటున్న
మనం మనుషుల మనే భావనతోనే
లింగ వివక్ష హద్దులు చెరిపేసుకుని.
నీవు నా నేస్తానివే నని.
నా గుండెలోని బరువంత
అలుగు దునికినట్టు వెల్లబోసుకున్న
నీ చల్లటి ఓదార్పుకై.
నాలో ఉప్పొంగుతున్న.
వేదనను నిమురుతవని.
కాలం పరీక్షలెన్ని పెట్టిన
కడుపులోనే దాచుకుని.
నిన్ను స్మరిస్తూనే.
వెచ్చటి కన్నీరు నిరీక్షణే.
నీచూపు నాపై సోకగానే.
నా కష్టాలన్ని మర్చిపోయి.
ఆనందపు కెరటాలు.
తీరం హృదిని తట్టినప్పుడల్ల.
నిశ్శబ్ద కేరింతల్లో మునకలు వేస్తు
సరాగాలనల్లుకుంట.
నీతో కలిసి ప్రయాణం చెయ్యాలని
కాంక్షనెంతగ ఉన్న
విధి ఆడించే చదరంగంఆటలో.
నీవో వైపు నేనో వైపు.
భిన్న ధ్రువాలమే ఐన.
ఇరువురం ఒకరికొకరం.
మౌన పలకరింపే
దశాబ్దాల కాలం దాటవేసిన.
మరువలేని జ్ఞాపకాలే.
స్నేహానురాగాల పురిని
శ్వాసవిడిచేదాక
తెంచుకోనంటుంది

-యరకల యాదయ్య
9866468979.



తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

## ప్రళయ గరళ జలం!!

వరద గూడు కాదు
కట్టుకున్న గూడే వరదలో పోయింది.
పంట ఇంటికి చేరకముందే
చేజారి నీరై పోయింది.
ఊర్ల మీద సముద్రం ముద్రలు
ఇపుడు అన్నీ బురద ఊర్లు.
తుఫానుకు హృదయం లేదు
ఉప్పు పాతర వేసేసింది.
ప్రళయ జలం
గరళ జలం
ఆకాశం నీరై కూలింది.
జన వాసాలకు చిరునామే లేదు
అంతా మాయా జలం
జలమయం

**-కందాళై రాఘవాచార్య**
87905933638

## ఉక్కు మనిషి

మనిషి అంటే అట్లుండాలి
మనసు అంటే అట్లుండాలి
అచంచల దేశ భక్తి విధేయత
అఖండ భారత దార్శనికత!.
సత్ సంకల్పాల కార్య శీలి
సంస్థానాలను విలీనం చేసిన దీశాలి
స్వతంత్ర భారత సమైక్య రూప శిల్పి
సర్వదా స్మరించ దగిన వేల్పు!.
బార్డోలి కిసాన్ ఉధ్యమ నేత
సాటిలేని ధృడ సంకల్పాల మేటి
గాంధీ మహాత్ముని ప్రేరణ
స్వదేశీ వస్త్రధారణ ఆచరణ!.
ఆధునిక ప్రజాస్వామ్య పునాదులు
ఆనాటి ఆలోచనాత్మక ధోరణులు
అసాధ్యాలను సుసాధ్యం చేసిన
ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్
స్టాచ్యూ ఆఫ్ యూనిటీ
విశ్వ విఖ్యాత సమైక్యతా మూర్తి!
(సర్దార్ పటేల్150వ జయంతి)

**-పట్లొళ్ళ బక్కారెడ్డి**
9705315250

## మా ఆకాంక్ష!

ఎర్రని వెలుగులు పంచుతూ
సహ్యాద్రి కొండమించి సూరీడు
ఈఖీూ లో లీవ్ పెట్టి సెలవన్నాక
మా పెద్దయ్యగారు సంధ్యవార్చాక
ఆకసానికిది తొంబైఎనమిదివ
నెలపొడుపు సంధ్యాసమయం
నల్లనితెరల చీకట్లకు క్లిప్పు బిగించాక
శివ సాహితీ నిలయం వెలిగిపోతోంది చిత్రంగా
ఎందుకని ప్రశ్నించకండి నన్ను ఆత్రంగా
మన మధ్య ఉన్నదిఉదయ్ బాబు సార్ కాదా
చీకటి చింతలు ఇంకా... అవీఇవీ
ఎలా ఉంటాయి కవీ
ఆయన మాట నిమ్మలం ఆయన మనసు నిర్మలం
సర్ నేము మార్యాల సారంటే మాకెంతో మార్యద
స్కూల్ అసిస్టెంట్ గా ఉపాధ్యాయ వృత్తి లో చేరి
అచంచల ఆత్మవిశ్వాసంతోఅంచెలంచెలుగా ఎదిగి
విద్యా శాఖకు వెన్నెముఖగా నిలిచి
ఈంఅ జిల్లా విద్యాధికారి పీఠం అధిష్టించి
విద్యారంగాన
అంబరమంటిన అద్భుతవిద్యా విజయాలు
ఎన్ని సాధించినా
జీవితరంగాన కష్టాలు మూకుమ్మడిగా
ఎదురై బాధించినా
లెక్కచేయని మా లెక్కల పంతులు మీరు
ఏనాడు మారలేదు మీ స్వరం
ఎంతవెతికినా దొరకదు మీలో కించిత్ గర్వం
ఉదయ్ బాబు సారంటేఉన్నత విలువల మాస్టారు
మ సారన్నా మన సారన్నా మీరే
మాసారంటే మంచితనం
మా సారంటే సంచిత జ్ఞానం
మా సారంటే వినయం
మా సారంటే చిరుహాసం.
మా సారంటే చిన్మయరూపం
ఎమేత్తిపోయింది ఈ అక్టోబరుకు
అదిగదిగో వడివడిగా వస్తోంది సార్ వైపు
ఎంతటి వారలయితేనేం
కాలం కప్పేయదా శాలువా
పైకి వెళ్ళిన ప్రతీ వస్తువు భూమిని చేరే
భూమ్యాకర్షణ లాంటిదే
ఉద్యోగస్తుడి పదవీ విరమణ
చెమ్మగిల్లిన హృదయంలో
కూడికలు,తీసివేతల తర్వాత
గుణకారభాగహారాలదే పెద్దకత
మిగిలింది పగుల్ల దిగుల్ల విశ్రాంత జీవితం
దాని నడక గాలివాటం
జీవిత చరమ పోరాటంలో
ఆఖరు చరణమేదో తెలియని మలిసంధ్య గీతం
మా సారు భావి జీవితం
బాగుండాలని ,కలలన్నీ నెరవేరాలని
మా ఆకాంక్ష.

**-రమేశ్ నల్లగొండ**

## మెడిసన్ ప్లాంట్

అతడు ఇతన్ని చూసి గౌరవించటం
ఇతడు అతన్ని చూసి
గర్వించటం
రెండూ ఎదుగుదలకు
సంబంధించినవే!
ఎదుగుదలలో కీర్తి కాంక్ష
పేరుకపోయినట్టు
పెరుగుదలలో ప్రేమలు
అభిమానాలు పేనుకపోతాయి
తల్లికి కొడుకుపట్లా
తండ్రికి బిడ్డపట్లా ఉండే
అనురాగాలు కావాలి!.
ఆరాధించటంలో
భక్తుడు పారవశ్యం
పొందుతాడనేది నిజం!
అధిక్షేపించనూవచ్చు
అవహించనూవచ్చు
ఆలోచన్లో అపసవ్యం దొర్లొద్దు
మూర్ఖత్వపు ఆలోచనలేదు నిజమే!
నొప్పించటమంటే
గుణాన్ని గుండుసూదితో గుచ్చటం
బాధింటమంటే
మనసును నిప్పులో పొర్లించటం
మజాక్ కాదు
మాటల గారడీ కాదు
వ్యర్థ అనర్థ కార్యం
ఎవరికైనా నచ్చదు
తప్పుచేయని వాడు తప్పుచేయటం
శుద్ధతప్పు
జుగుప్సాకరమో
పనికిమాలిన కార్యమో
చేసిన తప్పుకు
పశ్చాత్తాప్పడటమే క్షేమకరం!
పరివర్తనపొందటమే
మేలుకరం!
బాధించటంబాధపడటం
ఎంతకీ ఎప్పటికీ మంచిదికాదు
దురాలోచన ముళ్ళముక్కను పెరికేస్తే తప్ప
ఆరోగ్యకరమైన ఆయుర్వేద మొక్కమొలవదు!!

**-కందుకూరి శ్రీరాములు**
9440119245






## అర్థపరమార్థాల కార్తీకం

ప్రతి గుడిలో, ప్రతి హృదిలో
వినిపిస్తూ, ప్రతిధ్వనిస్తూ
ఇంటా బయటా
పవిత్ర వాతావరణం
పఱచుకునే మాసం ;
శిక్కులగురువు
గురునానక్ బోధల
పున్నమి వెలుగులు
పుడమిని పునీతం చేసిన మాసం ;
ప్రకృతి నీడలోప్రజలందరూ
స్నేహసౌహార్ద్రాలతో
వనభోజనాలు ఆరగించే
ఆనందోల్లాసాల మాసం ;
ఉభయసంధ్యల్లో బాహ్యాంతర్గత
అంధకారాన్ని తరిమిగొట్టే
జ్ఞానజ్యోతులకు నిలయం,
అన్నదమ్ములు సంతసాన
అక్కచెల్లెళ్ళ చేతిభోజనాన్ని
సంతుష్టిగ భుజించే మాసం ;
నలుగురు కలిసి నాగదేవతను
ఆరాధించి, భారతీయుల
భూతదయను వేనోళ్ళ చాటే
పావన మాసం ;
సామూహిక రుద్రాభిషేకాలు
సత్యనారాయణ వ్రతాలు
ప్రతిధ్వనించే మాసం,
వేసంగి వేడి తొలగి
చల్లని వెన్నెల రాత్రులకు చోటిచ్చే
కార్తీకమాసానికి హార్దికస్వాగతం.

**-ముద్దు వెంకటలక్ష్మి**
బెంగుళూరు

## ఆత్మ జ్ఞానం

పెంజీకటి కావల పరుండి
లోకాలను పాలించేజనార్ధనా
నీవు వెలిగించిన దీపాలు దేదీప్యమానంగా వెలుగుతూ
సకల లోకాల చీకట్లను ఊడ్చేసే అఖండ దీపాలు గగనాన.
కోవెల ధ్వజస్తంభం పైన వెలిగించిన దీపకాంతుల
వెలుగువై అభ్యున్నతి పొందలేని చెట్లు,
వాటిని ఆశ్రయించిన సమస్త ప్రాణులపై ప్రసరించి కరుణతో
జీవన్ముక్తి కలిగించు పరంధామా !! ఓ దీపమా!!.
అనూచానంగా అల్పమైన అజ్ఞానాన్ని అంతం చేసి
అనల్పమైన విజ్ఞాన జ్యోతి ప్రజ్వలన చేసి
జ్ఞానం ప్రబోధించెడి గురు పరంపర ఒక ఆకాశదీపం.
మహిళలు మక్కువతొ జలాశయాల వద్ద వెలిగించిన కార్తీక పౌర్ణమి
ప్రమిదల కాంతి సమస్త జలచరాలకు
స్వర్గ ప్రాప్తి కలిగించే మహేశ్వరుని మానసము.
అనాధలను అన్నార్తుల ఆదుకొని,
అనురాగం ఆప్యాయత పంచి ఆనందం పొందు మనిషి మానవత్వపు
వెలుగులీనే అమోఘమైన ఆకాశదీపం.
మూఢనమ్మకాలకు బందీలై తమకు తామే బలౌతున్న
మూఢుల సంస్కరించి సంస్కారం సుసంపన్నం చేసే
సంస్కర్తలు,సమాజానికి వెలుగు నింపే ఆకాశదీపాలు.
.కార్తీక మాస దీపోత్సవం కారుచీకట్లను కాలరాసి
కష్టజీవులను సైతం కరుణించి ప్రసరించి కైవల్య మొసగెడి
దివ్య మంగళ ప్రభల కాంతుల కాలమిదే.
విష్ణు మహేశ్వరులకు ఇష్టమైన కార్తిక మాసం
పితృదేవతలకు మోక్షమార్గం చూపించు ఆకాశదీపం
ప్రజలలో ఆధ్యాత్మిక చింతన పెంపు చేయుట కోసం
సత్కర్మలను చేయించి సంభావించు ఆకాశదీపం

**-కేశరాజు వేంకట ప్రభాకర్ రావు**
628197982

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com